# సేవాలయాలు

- పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి
- సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ
- ఐదు సచివాలయాలు ప్రారంభానికి సిద్ధం


చింతూరులోని గ్రామ సచివాలయం


ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రారంభించనున్న కుమ్మూరు గ్రామ సచివాలయం

**చింతూరు:** ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా మారింది. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా అమలుచేస్తున్న ఈ వ్యవస్థ ప్రారంభమై నాలుగేళ్లు దాటింది. సచివాలయాల ద్వారా 500కు పైగా ప్రభుత్వ సర్వీసులు అందుబాటులో ఉండగా వీటి సేవలను ప్రజలకు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

**పటిష్టంగా అమలయ్యేలా**

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు పక్కాగా అందించేందుకు సచివాలయ సేవలను పటిష్టంగా అమలు చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వివిధ చర్యలు తీసుకోవడం, వ్యవస్థ తీరుపై వివరాలు సేకరించడం, సిబ్బంది పనితీరుపై దృష్టి సారించడం ప్రధానమైనవి. సిబ్బంది ఎలాంటి అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో అలసత్వం వహించకుండా నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పథకాలు పక్కాగా**

నవరత్నాలతో పాటు ఇతర పథకాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు సచివాలయాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. గ్రామ వలంటీర్ల సహకారంతో సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయి. గతంలో ఏదైనా పథకం కావాలంటే మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ఎన్నో ఇబ్బందులు పడినా పథకాలు అందుతాయనే గ్యారంటీ లేకుండా పోయేదని, నేడు ఆ పరిస్థితులు లేవు. గ్రామంలోని సచివాలయాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుకతో పాటు వాహనమిత్ర, జగనన్న విద్యాదీవెన, చేదోడు, వైఎస్సార్ బీమా, పంట రుణాలు, జగనన్న తోడు తదితర పథకాలు కూడా సచివాలయాల ద్వారా పేదలకు అందుతున్నాయి.

**ప్రారంభానికి సచివాలయాలు సిద్ధం**

చింతూరు మండలంలో 13 సచివాలయ కేంద్రాలు మంజూరు కాగా వాటిలో ఐదు సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తయిన ఏడుగురాళ్లపల్లి, తుమ్మల, కుమ్మూరు, ఏజీకొడేరు, కల్లేరు గ్రామ సచివాలయ భవనాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం ప్రారంభించనున్నారు.

### లబ్ధిదారుల్లో సంతోషం



సచివాలయ సేవలు అందుబాటులోకి వచ్చాక లబ్ధిదారులు ఎంతో సంతోషంగా వున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. సిబ్బంది సైతం అవినీతికి తావులేకుండా విధులు నిర్వహిస్తున్నారు.

– ముచ్చిక నాగార్జున, కుమ్మూరు సర్పంచ్, చింతూరు మండలం

### త్వరితగతిన నిర్మాణాలు



మండలంలో 13 సచివాలయాలకు గాను ఐదు నిర్మాణాలు పూర్తికాగా వాటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగింది. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఇప్పటికే పెండింగ్ బిల్లులు సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించడం జరిగింది.

– వెంకటరత్నం, ఎంపీడీవో, చింతూరు

# గడప గడపకు సంక్షేమమే లక్ష్యం


గొడిచింత గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ప్రజా సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం
- గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఘన స్వాగతం

**గూడెంకొత్తవీధి:** గడప గడపకు సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాడేరు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. మండలంలోని రింతాడ సచివాలయం పరిధిలో అరటిచెట్ల వీది, కోరాపల్లి, గొడిచింత మర్రిపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 192 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారని, శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కలుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎంపీపీ బోయినకుమారి, జెడ్పీటీసీ శివరత్నం, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరమ్మ, ప్రకాష్, దామనాపల్లి సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**కూనవరం:** కూనవరం మండలం చూచిరేవుల గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో చూచిరేవుల గూడెం, పైదిగూడెంలో శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటలకు గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు గురువారం పార్టీ వర్గాలు తెలిపాయి. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

### గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

**హుకుంపేట:** సూకురు పంచాయతీ మేభ, భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం గురువారం సందర్శించారు. గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు సౌకర్యం కల్పించాలని విన్నవించగా ఆయన స్పందించారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సింహాచలం ఉన్నారు.

### రవాణా సదుపాయం కల్పించాలి

**రాజవొమ్మంగి:** జిల్లాలోని మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రవాణా సదుపాయం లేక అత్యవసర వేళల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

### గుండెపోటుతో కలాసీ మృతి

**చింతపల్లి:** స్థానిక జీసీసీ గోదాములో కలాసీగా పనిచేస్తున్న సూరిబాబు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాలు కోరారు.

### తహసీల్దార్‌గా సత్యనారాయణ


తహసీల్దార్ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

**దేవీపట్నం:** మండల తహసీల్దార్‌గా కె.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. కడియం మండలం నుంచి పదోన్నతి పొంది దేవీపట్నంనకు బదిలీ అయ్యారు. ఇంతవరకూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పి.రామకృష్ణ డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగనున్నారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

### ఐక్య క్రైస్తవ సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గంతో పాటు గౌరవాధ్యక్షులు తదితరులు

**రాజవొమ్మంగి:** మండల ఐక్య క్రైస్తవ సంఘ కాపరుల నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షులు బిషప్ డీడీఎస్ మనోహర్‌రాజు, కె.సాల్మన్ రాజు, రెవరెండ్ సీహెచ్.కిశోర్‌కుమార్, వై.పాల్ నాయకత్వంలో ఈ ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా పీ. జోషఫ్ (చిన్నాలుదొర), జనరల్ సెక్రటరీగా డీసీహెచ్.రూబేన్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.సూర్యకుమారి, ట్రెజరర్‌గా రెవరెండ్ కె.లాజరస్, వైస్ సెక్రటరీగా ఎస్.డానియేలు, వైస్.ట్రెజరర్‌గా జి.శ్యామ్‌సన్, సభ్యులను ఎన్నుకున్నారు.

### జేవీకే కిట్లు త్వరితగతిన పంపిణీ చేయాలి


స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

**జి.మాడుగుల:** జేవీకే కిట్‌లను త్వరతగతిన విద్యార్థులకు పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖరరావు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వం సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఉన్న మండల జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. జేవీకే కిట్‌ల పంపిణీ వివరాల సీఆర్‌పీలను అడిగి తెలుసుకున్నారు.

# అభివృద్ధి పథంలో గిరిజన గ్రామాలు


జర్రిపడలో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ గణపతి, నేతలు

**ముంచంగిపుట్టు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పెదగూడ సర్పంచ్ మండి బాబూరావు అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.6 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు గణపతి, నేతలు గురువారం భూమిపూజ చేశారు. సర్పంచ్ బాబురావు మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు గడప గడప నిధులతో నూతన సీసీ రోడ్లు మంజూరు చేస్తూ వారి కష్టాలను తీరుస్తున్నమన్నారు. ప్రజలంతా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకుడు కె.దాసుబాబు, వార్డు సభ్యుడు కేశవరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

**అరకులోయ రూరల్:** విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు సింగిల్, మేజర్ సబ్జెక్టులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై పూర్తిగా పరిజ్ఞానం పెంపొందించుకొంటే మరింత నైపుణ్యం పొందవచ్చన్నారు. ప్రత్యేక ప్రణాళితోనే విద్యా విధానంలో రాణించగలమన్నారు. ప్రతి ఒక్కరు చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అధ్యాపకులు కొండబాబు, నాగబాబు, పద్మలత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా అమ్మవారి ఉత్సవం


ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

**రాజవొమ్మంగి:** మాలకొండమ్మ తల్లి పండుగను స్థానిక గిరిజనులు గురువారం సంప్రదాయంగా జరుపుకొన్నారు. గిరిజన ఆచార సాంప్రదాయంలో భాగంగా ఏటా ఈ అమ్మవారి సంబరం జరుపుకోవడం అనాదిగా వస్తోంది. వర్షాలు కురవాలని, తొలకరి పంటలు సంమృద్ధిగా పండాలని ఏటా ఈ నెలలో గ్రామస్తులు అమ్మవారి పండుగను జరుపుకొంటారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచుకొని డప్పు వాయిద్యాలు, బాణాసంచాల వెలుగుల నడుమ అమ్మవారు కొలువై ఉన్న ప్రాంతానికి వెళ్లారు. రకరకాల పిండివంటలు, పసుపు కుంకుమలు సమర్పించారు. దీప దూప నైవేద్యాలతో పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకొన్నారు.

# క్షయ, కుష్టుపై గ్రామాల్లో సర్వే


వై.రామవరంలో సర్వేపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దినేష్


చింతూరులో సిబ్బందికి కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**వై.రామవరం:** మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లతో చవిటిదిబ్బలు వైద్యాధికారి డాక్టర్ దినేష్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ప్రతి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుష్టు, క్షయ వ్యాధులపై సర్వే చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి సచివాలయం ఏఎన్‌ఎమ్‌ల ద్వారా తమకు నివేదిక సమర్పించాలన్నారు. వ్యాధుల లక్షణాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచిత వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు సరఫరా చేస్తుందన్నారు. ఎంఎల్‌పీహెచ్‌ఓలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**చింతూరు:** జాతీయ కుష్టు నిర్మూలన కార్యాక్రమంలో భాగంగా తులసిపాక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలున్న రోగులను గుర్తించి సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి వైద్యపరీక్షలు చేయించాలని ఆయన సూచించారు. డాక్టర్ నిఖిల్, వైద్య సిబ్బంది ముక్తేశ్వరరావు, సరోజిని, గంగరాజు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఔదార్యం


చిన్నారి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు

**చింతపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ నేపథ్యంలో తమ స్నేహితుల్లో ఒకరైన నాగేశ్వరరావు కుమారుడు బాలసాయి భవానీప్రసాద్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకుని ఆవేదన చెందారు. తమకు తోచిన విధంగా తన స్నేహితుని కుమారుని వైద్యానికి అవసరమైన సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారంతా రూ.30వేలను సేకరించి, తమ స్నేహితుడు భవానీ ప్రసాద్‌కు అందజేసి, కష్టాల్లో మేమున్నామంటూ వారంతా భరోసా ఇచ్చారు.

### నష్టపరిహారం చెల్లించాలి



**అనంతగిరి:** మండలంలోని ఎగువశోభ, టోకూరు పంచాయతీల్లో పోర్నపోదర్, బిర్జిగుడ, దొరగుడ, కొత్తవలస, కంబవలస గ్రామాలను ఆనుకొని కేకేలైన్‌లో రెండోలైన్ విస్తరణలో భూములు కోల్పోతున్న గిరిజనులను నష్టపరిహారం చెల్లించిన తరువాత పనులు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.

### పాఠశాల భవనం పనులు పూర్తి చేయాలి


అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న

**అరకులోయ రూరల్:** మండలంలోని బస్కి పంచాయతీ బొండగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని వైస్ ఎంపీపీ రామన్న గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతు 2011లో పంచాయతీకి చెందిన టీడీపీ పార్టీ మాజీ సర్పంచ్ బలరాం పాఠశాల పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేయడంతో గత్యంతరం లేక గ్రామస్తులు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక షెడ్డులోనే బోధన సాగుతోందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### జేవీకే కిట్లు పంపిణీ



పనసలపాలెం,భీంపోల్‌లో జేవీకే కిట్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**వై.రామవరం:** పనసలపాలెంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం అప్పలనాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తదితరులు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ విశ్వమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ, సర్పంచ్ నరసింహరావు, కనకరాజు పాల్గొన్నారు.

**అనంతగిరి:** భీంపోల్‌లోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను ఎంపీటీసీ సభ్యుడు అశోక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం కిరణ్, ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎం అప్పలనాయుడుకు సన్మానం


హెచ్‌ఎం అప్పలనాయుడును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

**వై.రామవరం:** మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల నూతన హెచ్‌ఎం అప్పలనాయుడుకు గురువారం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం గురువారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో మండలంలోని గుర్తేడు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా రెండు పర్యాయాలు, సుమారు ఆరేళ్లపాటు అప్పలనాయుడు పనిచేసి, పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారని, మెరుగైన బోధనతో పాటు విద్యార్థులను క్రమశిక్షణ బాటలో నడిపించారన్నారు. ఇక్కడి పాఠశాల అభివృద్ధికి కూడా ఆయన సేవలను అందజేయాలని కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ రోలిపల్లి నరసింహమూర్తి, నాయకుడు కనకరాజు, వార్డెన్ రెడ్డి, ఉపాధ్యాయలు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

**గంగవరం:** మండల కేంద్రంలో చర్చ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో దైవ సన్నిధి రిలాక్స్ సెంటర్ డైరెక్టర్ సంతోష్ బిత్తరి ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు కుట్టు మిషన్లు తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఆర్‌ఐ ఫయాజ్‌బాషా(జిలానీ) అందజేశారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. మహిళల జీవనోపాధికి కుట్టు మిషన్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని, దీన్ని ప్రోత్సాహించిన సంతోష్‌ను ఆయన అభినందించారు. డీఎస్‌ఆర్ సెంటర్ డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ మహిళలకు కుట్టుపై మూడు నెలల ఉచిత శిక్షణ ఇచ్చిమన్నారు. శిక్షణ పొందిన వారికి రాజమండ్రి స్వర్ణ సోషల్ ఆర్గనైజేషన్, అమలాపురం సీపీఎఫ్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహాయంతో 50శాతం సబ్సిడీపై కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఆర్‌ఐ జీలానీలను డీఎస్‌ఆర్ సెంటర్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. స్వర్ణ సోషల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ స్వర్ణలత,, సీపీఎఫ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ప్రసాద్, ఫ్యాషన్ డిజైనర్ జార్జిన, అనుదీప్, ఎం.బాబూరావు, రాజారెడ్డి, జి.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షతో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం


అరకులోయలో మాట్లాడుతున్న హస్తినకుమార్, సచివాలయం సిబ్బంది


చూచిరేవులగూడెంలో మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి మరియాదాస్

**అరకులోయ రూరల్:** మండలంలోని కొత్తభల్లుగూడ పంచాయతీ కేంద్రంలో సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో సచివాలయ కన్వీనర్ హస్తినకుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంతోనే ప్రజా సమస్యలు సత్వర పరిష్కారమవుతాయన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కన్వీనర్లు రాధిక, ఓల్లేష్, నాయకులు రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి దేవ, వీఆర్వో దమయంతి తదితరులు పాల్గొన్నారు.

**జి.మాడుగుల:** మండలంలో కె.కోడాపల్లి, పాలమామిడి పంచాయతీ కార్యాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి వర్క్‌షాపు గురవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం, సర్టిఫికెట్ల జారీ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డతీగల:** జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.బాపన్నదొర తెలిపారు. మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు.

**కూనవరం:** చూచిరేవులగూడెం సచివాలయంలో ఎంఎల్‌వో సురేష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని సత్వరం పరిష్కరిస్తారన్నారు. సర్పంచ్‌లు తెల్లం నిరోషా, రామయ్య, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు సోముల కొండలరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కీర్తన, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయం కన్వీనర్లు చిచ్చడి మంజుల, సోముల సత్యనారాయణ, బేతి ముత్తయ్య, పద్మావతి, వెంకటేశ్వరరావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# 25 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు


మోదకొండమ్మతల్లి

**సాక్షి,పాడేరు:** మండలంలోని గుత్తులపుట్టు గ్రామంలో ఈనెల 25వ తేది నుంచి మూడు రోజుల పాటు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మోదకొండమ్మతల్లి ఆలయానికి రంగులు వేసే పనులు పూర్తయ్యాయి. సంతబయలు నుంచి గుత్తులపుట్టు గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్‌దీపాలంకరణ పనులు జరుగుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.